సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



అవగాహన పెరిగి.. కేసులు తగ్గి

దశాబ్దానికి ముందు చాపకింద నీరులా విస్తరించిన ఎయిడ్స్ మహమ్మారి వెనకడుగు వేస్తోంది. దీనికి ప్రభుత్వం చేసిన కృషి సత్ఫలితాలనిస్తోంది.


8లో



ఆటోను ఢీకొన్న లారీ

కత్తిపూడి జాతీయ రహదారి పై ఓవర్ సమీపంలో గురువారం ఆటోను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా ఐదుగురికి తీవ్ర గాయాలైనట్లు అన్నవరం పోలీసులు తెలిపారు.

3,900 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు గురువారం 3,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,300,మధ్య డెల్టాకు 600,పశ్చిమ డెల్టాకు 2,000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ప్రింటోనికా శివరామ కలర్‌ల్యాబ్‌కు అవార్డులు



అవార్డు అందుకుంటున్న అవినాష్, సతీష్, నాని

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ ప్రింటింగ్ కంపెనీ ప్రింటోనికా శివరామ కలర్‌ల్యాబ్‌కు ప్రతిష్టాత్మక హెచ్‌పీ ఆసియా పసిఫిక్ అండ్ జపాన్ డిజిటల్ ప్రింట్ ఎక్సెల్ ఇన్స్‌పిరేషన్ – 2023 అవార్డు లభించింది. హైదరాబాద్‌లో ఈనెల 29న జరిగిన హెచ్‌పీ డెస్కూప్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ప్రింటోనికా శివరామ కలర్‌ల్యాబ్ సంస్థల డైరెక్టర్ పులవర్తి అవినాష్, టెక్నికల్ హెడ్ ఈలి సతీష్, టెక్నికల్ టీమ్ బొమ్మిరెడ్డి నాని తదితరులు ఈ అవార్డును అందుకున్నారు. ఆసియా పసిఫిక్ దేశాల నుంచి 900 ప్రముఖ ప్రింటింగ్ కంపెనీలు ఈ పోటీలో పాల్గొన్నారు. ఫొటో బుక్, కమర్షియల్ ప్రింటింగ్ కేటగిరీల్లో ఇన్నోవేషన్, ప్రెజెంటేషన్, టెక్నాలజీని ఆధారంగా చేసుకుని గ్రాండ్ విన్నర్, విన్నర్ అంతర్జాతీయ అవార్డు ప్రింటోనికా సంస్థకు లభించింది. అనంతరం హెచ్‌పీ ప్రింట్ సమ్మిట్, టెక్నాలజీ, సోషల్ మీడియా, కలర్ మేనేజ్‌మెంట్ సెమినార్‌లో హెచ్‌పీ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ హెయిమ్ లెవిట్ చేతుల మీదుగా ముంబై తాజ్ హోటల్‌లో ప్రీమియం ఫొటో ఆల్బమ్ కంపెనీ ఆఫ్ ది ఇయర్ అవార్డును డైరెక్టర్ పులవర్తి అవినాష్ అందుకున్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో ప్రతిభ




జాతీయ స్థాయికి సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎంపికైన మున్సిపల్ పాఠశాల బృందం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో కాకినాడ మదర్ థెరిస్సా మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి బిందు బృందం విశేష ప్రతిభ చూపింది. వీరు రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 29,30 తేదీల్లో గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. చిత్తడి నేల అవరణ వ్యవస్థలో-వలస పక్షుల సంరక్షణ అనే ప్రాజెక్టు జాతీయ స్థాయి ఎంపికైంది. కాకినాడ తూర్పు తీర ప్రాంతం, నది ముఖ ద్వారా ప్రాంతంలో నీటి పక్షుల సంఖ్య తగ్గుతోంది. మడ అడవుల్లో ఉన్న బ్లాక్ బిల్డ్ టర్న్ అనే పక్షులు అంతరించడంతో పాటు అంతర్జాతీయంగా 14 రకాలు అంతరించిపోతున్న పక్షులు ఈ ప్రాంతంలో ఉండటం వల్ల ఖ్య పక్షి కేంద్రంగాను,రామ్‌సర్ కేంద్రంగా పరిగణించాలని ఈ స్కూలు విద్యార్థులు తమ ప్రాజెక్టు ద్వారా సూచించారు. విద్యార్థుల బృందం ప్రవళిక,బిందులు ప్రజెంటేషన్ చేయగా గైడ్‌గా కేఆర్‌ఎస్ చంద్రారెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల బృందాన్ని డీఈఓ అన్నపూర్ణ,కో-ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు,అకడమిక్ సమన్వయ కర్త కె.వెంకట్రావు అభినందించారు.

పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఆలయంలో లక్ష పత్రి పూజలు చేసుకుంటున్న వారి కోసం ఆలయ దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. కార్తిక మాసంలో శివాలయంలో దీపాలు వెలిగిస్తే తాము కోరుకున్నది నెరవేరుతుంద భక్తులు పంచారామ క్షేత్రంలో పోటీ పడు తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి పూజలు, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు.

జాతీయ తైక్వాండో రిఫరీగా హర్షవర్ధన్



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): డెహ్రాడూన్‌లో శుక్రవారం నుంచి మూడో తేదీ వరకు జరిగే 37వ జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లాలోని పెద్దాపురానికి చెందిన ఎం.హర్షవర్ధన్ రిఫరీగా నియమితులయ్యారు. తైక్వాండో సంఘ జిల్లా కార్యదర్శి బి.అర్జునరావు గురువారం ఈ విషయాన్ని తెలిపారు. ఈ మేరకు తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి నియామక ఉత్తర్వులు హర్షవర్ధన్ అందుకున్నారు. హర్షవర్ధన్ పెద్దాపురం ఎంఆర్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని, బ్లాక్‌బెల్ట్‌తో పాటు రిఫరీ సర్టిఫికెట్ సాధించాడని తెలిపారు.



రాజానగరం నియోజకవర్గం వెలుగుబందలో రూపుదిద్దుకున్న విద్యుత్ ఉపకేంద్రం

ఇక ఫుల్ పవర్..!

- గ్రామాలకు త్రీ ఫేజ్ కరెంట్ సరఫరా
- రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వం
- రైతులకు ఆటంకం లేని విద్యుత్
- పరిశ్రమలకు 24 గంటలూ సరఫరా
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 26 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి అడుగులు
- రూ.411 కోట్ల నిధుల వ్యయం
- ఇప్పటికే ప్రారంభమైన పనులు

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రతి గ్రామానికీ నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. లో-వోల్టేజ్, ఓవర్‌లోడ్, ట్రిప్, పవర్ కట్ లాంటి సమస్యలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు, పల్లె ప్రజలకు త్రీఫేజ్ కరెంట్ అందించేందుకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు నాణ్యమైన విద్యుత్ ఇచ్చే క్రమంలో అనేక సంస్కరణలకు నాంది పలికింది. రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డీఎస్‌ఎస్)లో భాగంగా ఎలాంటి అంతరాయం లేకుండా 24 గంటల పాటు సరఫరా చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. వ్యవసాయ రంగానికి ప్రత్యేక ఫీడర్లతో కూడిన డెడికేటెడ్ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతోంది.

ఉమ్మడి తూర్పులో 26 సబ్ స్టేషన్లు

విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని పెంచే దిశగా ప్రభుత్వం విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా రూ.411 కోట్ల వ్యయంతో 26 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 132/33 కేవీ, 400/132 కేవీ, 220/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు అందుబాటులోకి తీసుకు వచ్చింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏపీఈపీడీసీఎల్ సంస్థ పనులు యుద్ధప్రాతిపదిన చేపడుతోంది. ఇందులో ఇప్పటికే 17 సబ్ స్టేషన్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిలో కొన్నింటిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. మిగిలిన తొమ్మిది ఉప కేంద్రాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయనున్నారు.

9 గంటల విద్యుత్ సరఫరా లక్ష్యంగా..

వ్యవసాయానికి పగటి పూటే 9 గంటల పాటు పకడ్బందీగా విద్యుత్ సరఫరా చేయాలనేది ప్రభుత్వ ఆశయం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతం చేయాలని నిర్ణయించింది. అయితే ప్రస్తుతమున్న ఫీడర్ల కెపాసిటీ సరిపోదని భావించింది. ఇందుకు ట్రాన్స్‌మిషన్ కెపాసిటీ అభివృద్ధి చేసే దిశగా చర్యలు ప్రారంభించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆర్‌డీఎస్‌ఎస్ ప్రాజెక్టులో భాగంగా 26 సబ్ స్టేషన్లు నిర్మిస్తోంది. ఇప్పటికే ప్రారంభమైన పనులు వేగంగా సాగుతున్నాయి. సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ ఫీడర్లు సిద్ధం చేస్తున్నారు. 1920 కిలోమీటర్ల మేర 11కేవీ డెడికేటెడ్ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. 38 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు సిద్ధం చేస్తున్నారు.

ప్రస్తుతం ఇలా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటి వరకు గ్రామాలకు సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఫలితంగా అనేక గ్రామాల్లో ప్రజలు లో-ఓల్టేజి సమస్యతో సతమతమవుతున్నారు. జిల్లా, మండల, పట్టణ ప్రాంతాల్లో మాత్రమే త్రీ ఫేజ్ విద్యుత్ అందుతోంది. వెరసి గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం ఉన్న చిన్నపాటి పరిశ్రమలు ఇబ్బందులు పడుతున్నాయి.

ఉపయోగం ఇలా..

విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణం పూర్తయితే అన్ని రంగాలకు నాణ్యమైన విద్యుత్ అందుతుంది. వ్యవసాయానికి ప్రత్యేక ఫీడర్లతో డెడికేటెడ్ విద్యుత్ లైన్లు అందుబాటులోకి వస్తాయి. వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా చేసే సమయంలో చిన్న, మధ్య తరహా, కుటీర పరిశ్రమలకు విద్యుత్ నిలిపివేసే అవస్థలు తప్పుతాయి. వీటితోపాటు పరిశ్రమలకు సైతం ప్రయోజనం చేకూరుతుంది. వ్యవసాయానికి 9 గంటలు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు వేర్వేరు విద్యుత్ లైన్లు ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

ఇప్పటికే అందుబాటులోకి సేవలు

నిర్మాణాలు పూర్తి చేసుకున్న విద్యుత్ ఉపకేంద్రాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఇవి రైతులు, ప్రజలు, పరిశ్రమలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించనున్నాయి. ఉదాహరణకు మచ్చుకు కొన్ని పరిశీలిస్తే..

- తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం వెంకటకృష్ణాపురంలో రూ.28.89 కోట్లు, నల్లమాడులో రూ.22.62 కోట్లు, టి.నరసాపురంలో రూ.60.20 కోట్లతో నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. వెంకటకృష్ణాపురంలో నిర్మించిన ద్వారకాతిరుమల సబ్ స్టేషన్ ద్వారా ద్వారకా తిరుమల, పెదవేగి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట మండలాల్లోని 1.05 లక్షల మందికి, నల్లమాడు సబ్‌స్టేషన్‌తో ఉంగుటూరు, నల్లజర్ల, భీమడోలు, నిడమర్రు మండలాల్లోని 2 లక్షల మందికి, టి.నరసాపురం సబ్ స్టేషన్ ద్వారా టి.నరసాపురం, చింతలపూడి, కామవరపుకోట మండలాల్లో మరో 2 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుంది.
- కోనసీమ జిల్లా అయినవిల్లిలో 21 ఎకరాల్లో 400/132 కేవీ సామర్థ్యం కలిగిన సబ్ స్టేషన్ రూపుదిద్దుకోనుంది. ఇందుకుగాను రూ.380.12 కోట్లు వెచ్చించనున్నారు. దీనికి సీఎం వైఎస్ జగన్ వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణంతో అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం, రామచంద్రపురం, రాజోలు, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, నర్సాపురం విద్యుత్ ఉప కేంద్రాలకు విద్యుత్ సామర్థ్యం పెరుగుతుంది.
- కాకినాడ జిల్లా తుని మండలం హంసవరంలో రూ.24.64 కోట్లతో 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఉప కేంద్రం నిర్మాణం పూర్తయితే తొండంగి, తుని, శంఖవరం మండలాల్లో వినియోదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుంది.

ఉమ్మడి తూర్పుగోదావరిలో మంజూరైన విద్యుత్ ఉపకేంద్రాలు ఇలా..

డివిజన్	మంజూరైనవి
అమలాపురం	3
రాజమహేంద్రవరం	7
కాకినాడ	5
రామచంద్రపురం	3
జగ్గంపేట	4
పెద్దాపురం	4

యుద్ధ ప్రాతిపదికన పనులు



వినియోగదారులు, రైతులు, పరిశ్రమలకు అంతరాయం లేని విద్యుత్ అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. అందుకు అనుగుణంగా విద్యుత్ సామర్థ్యం పెంచే పనులకు శ్రీకారం చుట్టాం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 26 సబ్ స్టేషన్ల నిర్మాణాలకు నాంది పలికాం. ఇప్పటికే 17 పూర్తయ్యాయి. మిగిలినవి సైతం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేకంగా లైన్లు అందుబాటులోకి రానుండటంతో వ్యవసాయానికి పగలు 9 గంటల పాటు నిరంతర సరఫరాకు అవకాశం కలుగుతుంది.

– టీవీఎస్ఎన్ మూర్తి, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్



వెలుగుబందలో విద్యుత్ ఉపకేంద్రం



రాజానగరం మండలం రాధేయపాలెంలో విద్యుత్ సబ్ స్టేషన్

జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు సంతృప్తికరం

- జిల్లాలో 2,58,431 మందికి వైద్య పరీక్షలు
- వీసీలో వివరాలు వెల్లడించిన కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా జిల్లాలో సంతృప్తికర సేవలు అందించినట్టు కలెక్టర్ మాధవీలత అన్నారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, ఆరోగ్యం, స్త్రీ,శిశు సంక్షేమం – ప్రభుత్వ పథకాలు, పాఠశాల విద్య, ప్రాధాన్యతా భవనాలపై గురువారం సాయంత్రం కలెక్టర్లతో వెలగపూడి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.జవహర్‌రెడ్డి సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం మందిరం నుంచి కలెక్టర్ మాధవీలత, ఇతర సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రగతిని వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా 2,58,431 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారిలో 6,816 మందిని తదుపరి వైద్య సేవల కోసం ఆరోగ్యశ్రీ రిఫరల్ ఆసుపత్రులకు సిఫారసు చేశామన్నారు. వారిలో 3,881 మంది వైద్య సేవలు పొందారని, మిగిలిన వారిని కూడా ఏఎన్ఎంలు సంప్రదించి, ఆరోగ్య సమాచారాన్ని సేకరించడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ పి.ప్రియాంక, డీసీహెచ్ఎస్ ఎం.సనత్ కుమారి, డీఈఓ ఎస్.అబ్రహం, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి జీవీఎల్ సుబ్రహ్మణ్యం, పీఆర్ఈఈ ఏబీవీ ప్రసాద్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.సందీప్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

13 వరకూ ఆడుదాం ఆంధ్ర రిజిస్ట్రేషన్లు

జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు నవంబర్ 27 నుంచి ప్రారంభమయ్యాయని, ఆయా సచివాలయ పరిధిలో 15 ఏళ్లు నిండి, క్రీడల్లో పాల్గొనే ఆసక్తి ఉన్న వారి పేర్లను వలంటీర్లు నమోదు చేయాలని కలెక్టర్ మాధవీలత సూచించారు. ఈనెల 13 వరకూ పేర్ల నమోదుకు అవకాశం ఉందన్నారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ వంటి ఐదు క్రీడాంశాలలో పోటీలు నిర్వహిస్తామని, ఏదైనా అంశాల్లో మాత్రమే ఒకరు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. సచివాలయాల్లో ఈనెల 15 నుంచి 20 వరకూ, మండల, మునిసిపల్ స్థాయిలో 21 నుంచి జనవరి 4 వరకూ, నియోజకవర్గ పరిధిలో జనవరి 5 నుంచి 10 వరకూ, జిల్లాస్థాయిలో 11 నుంచి 21 వరకూ పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన వారు జనవరి 22 నుంచి 26 వరకూ జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లాలోని 512 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పురుషుల, స్త్రీలు, వీక్షకుల పేర్లు నమోదు చేయాలన్నారు.

వైఎస్సార్‌కు భారతరత్న ఇవ్వాలని
సంతకాల సేకరణ

అనపర్తి: ప్రజా సంక్షేమమే ఊపిరిగా శ్వాసించి పలు సంక్షేమ పథకాలు అమలు చేసి అభివృద్ధికి బాట వేసిన దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి భారత రత్న ఇవ్వాలని కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన చెన్నారెడ్డి భాస్కర రెడ్డి ఆధ్వర్యంలో గురువారం అనపర్తిలో సంతకాల సేకరణను చేపట్టారు. ఈ సందర్భంగా భాస్కరరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ప్రజలకు సుపరిపాలన అందించిన వైఎస్సార్ భారతరత్న పురస్కారానికి అన్ని అర్హతలు కలిగిన నాయకుడన్నారు. కరోనా అనంతరం సంతకాల సేకరణను ఉద్యమంగా చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 69 వేల మంది సంతకాలను సేకరించామన్నారు. మూడు లక్షల మంది సంతకాలు సేకరించి గవర్నర్‌కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక జీబీఆర్ కళాశాల ఎదురుగా గల మామిడి తోటలో ఓంశక్తి సత్సంగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న భాస్కరరెడ్డి సంతకాలను సేకరించారు. భాస్కరరెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితోపాటు వనసమారాధనలో పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పలువురు గ్రామ ప్రముఖులు అభినందించారు.



సంతకాలు సేకరిస్తున్న భాస్కరరెడ్డి

అన్నదాతల్లో 'మిచాంగ్' కలవరం

- తుపాను హెచ్చరికలతో ఆందోళన
- జిల్లాలో 57శాతం వరికోతలు పూర్తి
- వర్షాలు కురిస్తే నేలనంటనున్న వరిచేలు
- అప్రమత్తం చేస్తున్న వ్యవసాయాధికారులు

రాజమహేంద్రవరం రూరల్: మిచాంగ్ తుపాను నేపథ్యంలో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలో మోస్తరుగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో ఈహెచ్చరిక రైతన్నలకు నిద్రపట్టకుండా చేస్తోంది.

పంట ఎక్కడ దక్కకుండా పోతుందోనని వణికిపోతున్నారు. జిల్లాలో 57శాతం మంది రైతులు వరి కోతలు కోసి ధాన్యం విక్రయించుకున్నారు. రేపో, మాపో కోతలు కోద్దామనుకుంటున్న రైతులు వర్షాలు కురుస్తాయనే వార్తలతో దిగులు చెందుతున్నారు.



రాజవోలు గ్రామంలో వరికోతలు కోస్తున్న దృశ్యం

జిల్లాలో వరిసాగు ఇలా:

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 1.77 లక్షల ఎకరాలు వరి సాగుచేశారు. వాతావరణం అనుకూలించడం.. తెగుళ్ల బెడద లేకపోవడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. 2.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అంచనా. ముందస్తు సాగు చేసిన పొలాలు అదనుకు రావడంతో నెల రోజులు నుంచి రైతులు కోతలు కోసి ఉత్పత్తిని మార్కెట్‌కు తరలిస్తున్నారు. గడ్డి కావాల్సిన రైతులు కూలీలతో కోత కోయించి మేట్లు వేస్తున్నారు. జిల్లాలో 1.07లక్షల ఎకరాలు వరికోతలు పూర్తయ్యాయి. ధాన్యం కూడా విక్రయించారు. సుమారు 70 వేల ఎకరాల్లో వరిచేలు పనలుపై ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించాలని భావిస్తున్నారు.

మిచాంగ్ తుపాన్‌తో జిల్లాకు వర్ష సూచన:

జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ శాఖ అప్రమత్తం చేసింది. శని వారం నుంచి వర్షాలు మొదలవుతాయని తాజాగా ప్రకటించింది. వర్షాలు కురిస్తే వరిపంట నేలకొరిగితే దిగుబడులు భారీగా తగ్గిపోయే పరిస్థితి ఉంటుంది. పంట నేలకొరిగే రెండు మూడు రోజులు వర్షాలు పడితే మొలకెత్తే పరిస్థితి వస్తుంది. ఈ రెండు రోజుల్లో పండిన కోతలు కోసి ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరిలించాలని హడావుడి పడుతున్నారు.



కడియం మండలంలో ధాన్యం ఆరబెట్టిన దృశ్యం

వ్యవసాయశాఖ రైతులకు సూచనలు

- ఈనెల 2వ తేదీ నుంచి రైతులు కోతలు కోయవద్దు
- పంట పొలాలు, కళ్లాల్లో ఎండపెట్టిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- పండిన చేలల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చేడులు తీసుకొని ఉంచుకోవాలి
- వరి నేలకొరిగితే రెండు, మూడు రోజులు వర్షం కురిస్తే వాటిపై ఉప్పు ద్రావణం పిచికారి చేసుకోవాలి.

రైతులను అప్రమత్తం చేశాం



మిచాంగ్ తుపాను కారణంగా రైతులను ముందస్తుగానే వరికోతలు కోసుకోవాలని అప్రమత్తం చేశాం. ఆ దిశగానే రైతులు వరికోతలు కోస్తున్నారు. ఒక వేళ వర్షాలు కురిస్తే కోతలు నిలుపుదల చేయమని సూచించాం. ఇప్పటివరకు 57శాతం వరికోతలు పూర్తయ్యాయి.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి

యంత్రాలు దొరకలేదు



హుకుంపేటలో వరికోతలు పూర్తిచేసి ధాన్యం అమ్మాను. మిర్తిపాడులోని 2.5ఎకరాల వరిచేను కోతకు వచ్చింది. కోతలు కోద్దామంటే వరికోత యంత్రాలు వేరే ప్రాంతంలో ఉన్నాయి. ఈ లోగా వర్షం వస్తే ఏం చేయాలో పాలుపోవడం లేదు.

–కురుమళ్ల ఆంజనేయులు,రైతు,హుకుంపేట

క్లుప్తంగా

ప్రమాదంలో 28 ఆవుల మృతి



వ్యాన్‌లో మృతి చెందిన ఆవు

రాజానగరం: ఆవులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్ ప్రమాదానికి గురికావడంతో అందులో ఉన్న 28 జీవాలు మృత్యువాత పడ్డాయి. జాతీయ రహదారిపై గామన్ బ్రిడ్జికి వెళ్లే దారిలో జీరో పాయింట్ వద్ద రెండు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వివరాలను స్థానిక సీఐ కాశీవిశ్వనాథ్ గురువారం రాత్రి విలేకరులకు తెలిపారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వ్యాన్‌లో 49 ఆవులు, లేగదూడలను అక్రమంగా తరలిస్తున్నారు. ఆ వాహనం ఆటోనగర్ దాటి జీరో పాయింట్‌కు చేరుకునే క్రమంలో ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను వేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 18 ఆవులు అక్కడికక్కడే చనిపోగా, ఆ తరువాత జరిగిన తొక్కిసలాటలో మరో 10 ఆవులు మృతి చెందాయి. గాయాలతో బయటపడిన మిగిలిన ఆవులను మిర్తిపాడులోని గోశాలకు తరలించారు. మృతి చెందిన ఆవులను, లేగదూడలను ఖననం చేయించామని సీఐ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కొన్ని ఆవులు వ్యాన్ క్యాబిన్‌లో ఇరుక్కుని వేలాడుతూ మృతి చెందడం విచారకరం.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

అమలాపురం టౌన్: రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన అమలాపురం జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి అప్పారి జగన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 24వ తేదీన రాయవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జగన్ విజయం సాధించి కోనసీమ నుంచి జాతీయ స్థాయి పోటీలకు వెళుతున్నట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ తెలిపారు. త్వరలో ముంబైలో జరగనున్న జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో జగన్ తలపడనున్నాడని పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జగన్‌ను మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు గురువారం అభినందించారు.

అవగాహన పెరిగి.. కేసులు తగ్గి

- తగ్గుముఖం పట్టిన హెచ్‌ఐవీ కేసులు
- సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ చర్యలు
- వ్యాధిగ్రస్తుల జీవన శైలి మెరుగుకూ కృషి
- నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

రాయవరం: ఎయిడ్స్..మొన్నటి వరకు దీనిపై నలుగురిలో మాట్లాడాలంటే వణుకు. దీంతో చాలా మంది ఈ వ్యాధిపై చర్చించకుండా నిశ్శబ్దంగా ఉండిపోయేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. దశాబ్దానికి ముందు చాపకింద నీరులా విస్తరించిన ఎయిడ్స్ మహమ్మారి వెనకడుగు వేస్తోంది. దీనికి ప్రభుత్వం చేసిన కృషి సత్ఫలితాలనిస్తోంది. ఎయిడ్స్ కూడా ఒక రుగ్మతే కదా అనే ధోరణి ప్రజల్లో వచ్చింది. దీనికితోడు ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమంటూ ప్రభుత్వం చేసిన ప్రచారం ప్రజల్లోకి వెళ్లింది. సురక్షితం కాని శృంగారం ఎంత ప్రమాదకరమో కరపత్రాల ద్వారా చాటి చెప్పడంతో క్రమంగా ప్రజల్లో చైతన్యం పెరిగింది. బహిరంగ చర్చ మొదలవ్వడంతో ఎయిడ్స్ వ్యాప్తి అదుపులోకి వచ్చింది. ఫలితంగా కొన్నేళ్లుగా ఈ మహమ్మారి తగ్గుముఖం పడుతోంది. నేడు ప్రపంచ ఎయిడ్స్ అవగాహన దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

హెచ్‌ఐవీ అంటే

హెచ్‌ఐవీ(హ్యూమన్ ఇమ్యునో డెఫిషియన్సీ వైరస్) అనేది ఎయిడ్స్ (ఎక్వైర్ ఇమ్యునో డెఫిషియన్సీ సిండ్రోమ్)ను కలగజేస్తుంది. ఈ వైరస్ లైంగికంగా, ఇన్ఫెక్షన్ సోకిన సూదులతో రక్తం ఎక్కించడం ద్వారా లేదా ఇన్ఫెక్షన్ సోకిన తల్లి నుంచి బిడ్డకు వ్యాపిస్తుంది. ఈ వైరస్ శరీరంలో రోగ నిరోధక శక్తిని బలహీనపరచి క్రమక్రమంగా ఆరోగ్యం క్షీణింపజేస్తుంది.

ఏఆర్‌టీ సెంటర్ల ఏర్పాటు

హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు చికిత్స అందించేందుకు అమలాపురం, రామచంద్రపురంలో ఏఆర్‌టీ సెంటర్లు ఏర్పాటు చేశారు. రాజోలు, కొత్తపేట, మండపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లతో



పాటుగా, కిమ్స్ ఆస్పత్రిలో ఒక ఐసీటీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఆస్పత్రిలో హైరిస్క్ వ్యాధిగ్రస్తులకు హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. హెచ్‌ఐవీ పాజిటివ్ వ్యాధిగ్రస్తులకు ప్రతి ఆరు నెలలకు వైరల్ లోడ్ పరీక్షలు చేస్తున్నారు. ప్రతి గర్భవతికి హెచ్‌ఐవీ టెస్ట్‌లు చేస్తున్నారు.

ప్రభుత్వం ద్వారా..

జిల్లాలో హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం సామాజిక పెన్షన్ రూ.2,750 అందిస్తోంది. ఈ విధంగా కోనసీమ జిల్లాలో 1,420 మందికి పెన్షన్లు ఇవ్వడం ద్వారా వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నారు.

ఎయిడ్స్ బాధితులకు పథకాలు

విద్యాశాఖ ద్వారా ఎన్ఎస్ఎస్ సహకారంతో కళాశాలల్లో రెడ్ రిబ్బన్ క్లబ్ అనే కార్యక్రమాన్ని అమలు చేస్తూ జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహిస్తున్నారు. పోలీస్, ఎన్ఎస్ఎస్, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌సీసీ జిల్లాలో కరోనా సమయంలోనూ రక్తదాన శిబిరాలు నిర్వహించాయి. రక్తదానం చేసి రక్తం కొరత లేకుండా సురక్షిత రక్త మార్పిడి ద్వారా హెచ్‌ఐవీ శాతాన్ని తగ్గించేందుకు దోహదపడ్డాయి.

కట్టడికి చర్యలు



జిల్లాలో హెచ్‌ఐవీ వ్యాధి అదుపులో ఉంది. దీని తీవ్రత గురించి తెలుసుకున్న చాలా మంది జాగ్రత్త పడుతూ వస్తున్నారు. హెచ్‌ఐవీ సోకిన బాధితులకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాం. ఎయిడ్స్ నుంచి బాధితుల రక్షణకు ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలిస్తోంది. రక్త నిధి నుంచి అన్ని మొబైల్ చికిత్సల వరకు బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచింది. గర్భిణుల నుంచి పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యాధి సోకకుండా కట్టడి చేస్తున్నాం.

– డాక్టర్ భరతలక్ష్మి, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నివారణ అధికారి, అమలాపురం

ఈ ఏడాది నినాదమిదే

ఏటా డిసెంబరు ఒకటవ తేదీన ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినంగా నిర్వహిస్తారు. ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడంత పాటు, దానిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై విస్తృతంగా చైతన్యం కలిగిస్తారు.

పరిస్థితి ఇదీ

హెచ్‌ఐవీ/ఎయిడ్స్ కేసులు తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2000–2001లో 4,600 కేసులు నమోదు కాగా, 2005–06లో 6,107 కేసులు నమోదు అయ్యాయి. 2009–10లో ఈ సంఖ్య 8,933కు చేరింది. దీంతో జాతీయ స్థాయిలో హెచ్‌ఐవీపై ప్రకటించిన యుద్ధం కారణంగా అన్ని స్థాయిల్లోనూ అనేక అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వ కృషితో పాటు, పలు స్వచ్ఛంద సంస్థల కృషి కూడా అభినందనీయం. ప్రభుత్వం చేసిన కృషి కారణంగా 2020–21లో కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టి 3,933కు చేరుకుంది. జిల్లాల విభజన అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2022 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు 56,544 మందికి 47,291 మందికి హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 31,658 మందికిగాను 26,703 మందికి పరీక్షలు నిర్వహించారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 ఏప్రిల్ వరకు 359 పాజిటివ్ కేసులు రాగా, ఏఆర్‌టీ సెంటర్లలో 355 కేసులు నమోదు చేయించుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 251 పాజిటివ్ కేసులు గుర్తించగా, 251 మంది ఏఆర్‌టీ కేంద్రంలో నమోదయ్యారు. 2022 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు గర్భవతుల్లో రెండు పాజిటివ్ కేసులు గుర్తించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు గర్భిణుల్లో ఐదు పాజిటివ్ కేసులు గుర్తించారు. 6,358 మంది పెద్ద వయస్సు వారు ఏఆర్‌టీ మెడిసిన్స్ తీసుకుంటుండగా, 68 మంది చిన్నారులు ఏఆర్‌టీ మందులు వినియోగిస్తున్నారు.

3న స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 3న జిల్లాస్థాయి స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి ఐ.రాజు గురువారం తెలిపారు. కాకినాడ జిల్లా వాకాడ గ్రామంలోని గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో ఈ ఎంపికలు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. 2006 నుంచి 2017 మధ్య జన్మించినవారు ఈ ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16, 17 తేదీలలో పల్నాడుజిల్లా నరసారావుపేటలో జరిగే అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ ఎంపికలకు అర్హత ధ్రువపత్రాలతో హాజరుకావాలని, వివరాలకు 92466 90466 నంబరులో సంప్రదించాలని సంఘ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్ కోరారు.

అత్యాచారం కేసులో 10 ఏళ్ల జైలు

కొత్తపేట: బాలికను నమ్మించి మోసగించి అత్యాచారానికి పాల్పడిన ఒక వ్యక్తికి పోక్సో కేసులో 10 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ కాకినాడ పోక్సో కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. ఈ కేసు తీర్పునకు సంబంధించి కొత్తపేట ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన చీకట్ల ప్రసాద్ అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికను 2016 సంవత్సరంలో నమ్మించి మోసగించి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై ఆ బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై విజయకుమార్ కేసు నమోదు చేయగా డీఎస్పీ ఎల్.అంకయ్య దర్యాప్తు చేశారు. ఈ కేసును కాకినాడ పోక్సో కోర్టుకు బదలాయించగా నేరం రుజువు కావడంతో జడ్జి వెంకటేశ్వరరావు పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ పితాని సత్యనారాయణ వాదించారు.

ఆటోను ఢీకొన్న లారీ

ఇద్దరు మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో చంద్రరావు మృతదేహం

శంఖవరం: కత్తిపూడి జాతీయ రహదారి ఫ్లై ఓవర్ సమీపంలో గురువారం ఆటోను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలైనట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. అన్నవరం ఎస్సై ఐ.కిశోర్ కథనంప్రకారం కత్తిపూడి నుంచి రావికంపాడు వెళుతున్న పాసింజర్ ఆటోను రాజమహేంద్రవరం నుంచి అన్నవరం వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న తొండంగి మండలం ఏవీ నగరం గ్రామానికి చెందిన గంపల చంద్రరావు, కాకాని నాగదేవి, కండవల్లి రత్నం, నెల్లిపూడి నాగభూషణం, రావికంపాడు గ్రామానికి చెందిన కె.సత్యనారాయణ, రెడ్నం కుమారి వివిధ పనుల నిమిత్తం కత్తిపూడి వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఏవీ నగరం గ్రామానికి చెందిన గంపల చంద్రరావు(65) అక్కడికక్కడే మృతి చెందగా, కొత్త చోడిపల్లిపేట గ్రామానికి చెందిన దోని కాశమ్మ(65) తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గంపల చంద్రరావుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరికీ వివాహం అయింది. కాకినాడ సమీపంలో వేళంగి వద్ద వ్యవసాయ క్షేత్రంలో కాపలా దారునిగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. మిగిలిన ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. క్షతగాత్రులను తుని ఏరియా ఆసుపత్రిలో వైద్యం చేస్తున్నారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి

జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు



స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాల సమావేశం గురువారం జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, రహదారులు, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, జగనన్న స్వచ్ఛ సంకల్పం, జాతీయ ఉపాధి హామీ పథకం, హౌసింగ్, విద్యుత్, గ్రామీణ అభివృద్ధి తదితర అంశాలపై ఇప్పటి వరకు జరిగిన పురోగతి, కొత్తగా ప్రతిపాదించిన పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం రాబోయే తుపానుల కారణంగా పంటలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకునేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు ఆదేశించారు. అదే విధంగా సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు అప్రమత్తతతో వ్యవహరించి గ్రామ స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులు, పంచాయతీరాజ్, వ్యవసాయం, విద్య, సంక్షేమ తదితర అంశాలపై చర్చించి, సభ్యులు తీర్మానాలు ఆమోదించారు. మొదటిగా చైర్మన్ వేణుగోపాలరావు 1, 2, 4, 7 స్థాయి సంఘాల పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో చర్చించి, వాటి అమలుకు ఆదేశాలిచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేయాలని అన్నారు. స్త్రీ, శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, చిన్నారులకు పౌష్టికాహారం సరఫరా, నాణ్యత తదితర అంశాలపై సభ్యులు, ఐసీడీఎస్ అధికారులతో కలిసి చర్చించారు. వ్యవసాయ స్థాయీ సంఘం చైర్మన్, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతులకు కల్పిస్తున్న సదుపాయాలు, ఇతర అంశాలను వ్యవసాయశాఖ అధికారి సభ్యులకు వివరించారు. రైతులందరికీ ఈ–క్రాప్ బుకింగ్, కౌలు రైతు కార్డు, రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అనుబాబు కోరారు. 6వ స్థాయీ సంఘం చైర్మన్, జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాంఘిక, గిరిజన సంక్షేమం, వెనుకబడిన తరగతులు, మైనారిటీ, యువజన సర్వీసులు, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ విభాగాల్లో అమలు అవుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను అధికారులతో చర్చించారు. ఈ సమావేశాల్లో జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి, ఆయా జిల్లాల వివిధ శాఖల అధికారులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, హౌసింగ్ తదితర శాఖల ఇంజినీర్లు, సంక్షేమశాఖల అధికారులు, జిల్లా ప్రజాపరిషత్ పాలనాధికారులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం రాయుళ్ల అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీలత


రాజమహేంద్రవరం రూరల్: కల్తీ మద్యం తయారు చేయడంతో పాటు ప్రభుత్వ వైన్‌షాపునకు తరలించి విక్రయిస్తున్న వ్యక్తితో పాటు, అతనికి సహకరిస్తున్న సేల్స్‌మన్‌ను అరెస్టు చేసినట్టు జిల్లా ఇన్‌చార్జి ఎక్సైజ్ సూపరింటెండెంట్ వై.శ్రీలత తెలిపారు. గురువారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. 180 ఎంఎల్ 239 కల్తీ మద్యం బాటిల్స్‌ను, బైక్, ఫోన్, 2,160 ఖాళీబాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మద్యం బాటిల్స్ విలువ రూ.38,500 ఉంటుందన్నారు.

రెండు నెలల నుంచి ప్రభుత్వ వైన్‌షాపులలో మద్యం అమ్మకాలు తగ్గాయి. దీనిపై సిబ్బందితో కలిసి పూర్తిస్థాయిలో మద్యం షాపుల్లో విక్రయాలుపై దృష్టి పెట్టామన్నారు.గురువారం ఉదయం ధవళేశ్వరం ఎర్రకొండ నేతాజీనగర్‌కు చెందిన దొడ్డి జగదీశ్వరరావు బైక్‌పై బ్యాగ్‌తో వెళుతుండగా ఎక్సైజ్ పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని విచారించారు. బ్యాగులో 180ఎంఎల్ ఆంధ్రాగోల్డ్ విస్కీ 89 కల్తీ మద్యం బాటిల్స్ లభించాయి. జగదీశ్వరరావును పూర్తిస్థాయిలో విచారించారు. అతని ఇంటికి తీసుకువెళ్లి సోదా చేయగా లేబుల్ లేని 150 మద్యం బాటిల్స్, ప్రింటర్, ఖాళీ బాటిల్స్, మూతలు, ఫుడ్‌కలర్స్, రెండుచిన్న బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కల్తీ మద్యం బాటిల్స్‌ను ఆల్కాట్‌తోటలోని వైన్‌షాపులోని సేల్స్‌మన్ పీఅండ్‌టీ కాలనీకి చెందిన కడియం వీర వెంకట సత్యనారాయణకు అమ్ముతున్నాడు. రూ.130 మద్యం బాటిల్‌ను రూ.110కి విక్రయిస్తాడన్నారు. రెండు నెలలుగా ఇలా విక్రయాలు జరుపుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. దొడ్డి జగదీశ్వరరావు, కడియం వీరవెంకటసత్యనారాయణలను అదుపులోకి తీసుకుని ఈ కేసు నమోదు నిమిత్తం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులకు అప్పగించామన్నారు.

కల్తీ మద్యం తయారీ ఇలా...

జగదీశ్వరరావు పలు వైన్‌షాపుల వద్ద ఆంధ్రాగోల్డ్ విస్కీ 180ఎంఎల్ మద్యం బాటిల్స్‌ను కొనుగోలు చేసుకుని ఇంటికి తీసుకుని వస్తాడు. ఇంటి వద్ద ఆ మద్యం బాటిల్ సీలును జాగ్రత్తగా తీసి అందులో నుంచి 30ఎంఎల్ మందును తీసేసి, నీటితో నింపేసి సీలు వేసేస్తాడు. ఇలా పలు బాటిల్స్ నుంచి తీసిన మద్యంను రంగువచ్చేవరకు ఫుడ్‌కలర్స్ కలిపి కొత్త మద్యంబాటిల్స్‌గా నింపి సీలు వేస్తాడు. ఆంధ్రా గోల్డ్‌విస్కీ లేబుల్స్ వేసి ఆల్కాట్‌తోటలోని మద్యం షాపునకు సరఫరా చేస్తుంటాడన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ త్రినాథ్‌రెడ్డి, ఎస్సై చౌదరి పాల్గొన్నారు.

ముగిసిన సైకాలజీ జాతీయ సెమినార్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామారెడ్డి

రాజానగరం: యూనివర్సిటీలో సొసైటీ ఫర్ రీసెర్చ్ అండ్ యాక్షన్, స్పృహ సైకాలజీ అలూమ్నీ అసోసియేషన్, రోటరీ డిస్ట్రిక్ట్ 3020, డిపార్టుమెంట్ ఆఫ్ సైకాలజీ, జీఎస్ఎల్ విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు గురువారం ముగిసింది. 'గ్లోబల్ పీస్ అండ్ హెల్త్ మేగ్నిమైజేషన్ ఎ కమ్యూనిటీ పెర్‌స్పెక్టివ్' అంశంపై ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కర్రి రామారెడ్డి ఉపన్యసించారు. ఎంతో విలువలు, ప్రమాణాలతో కూడిన మన సంప్రదాయాలు, ఇతిహాసాలు, పురాణాల విశిష్టత, ప్రాధాన్యతల గురించి సహేతుకంగా వివరించారు. విశ్వశాంతికి వ్యక్తిగత, సామాజిక, ఆరోగ్యకర జీవన విధానానికి కమ్యూనిటీ సైకాలజీ ఉపయోగపడుతుందన్నారు. మరొక ప్రముఖ జర్మటాలజిస్టు డాక్టర్ రవి వాడ్రేవు కూడా ప్రసంగించారు. స్పోర్ట్సు సైకాలజీలో ప్రతిభ కనబర్చిన ఆచార్య జితేంద్ర (పంజాబ్)కు జీవిత సాఫల్య పురస్కారాన్ని స్పృహ సైకాలజీ అలూమ్నీ, సుంకర భాస్కరరావు క్రీడాపరిశోధనాభివృద్ధి సంస్థ ద్వారా అందజేశారు. సొసైటీ ఫర్ కమ్యూనిటీ రీసెర్చ్ ఇన్ యాక్షన్ రీజనల్ కోఆర్డినేటర్ సుంకర నాగేంద్రకిషోర్ ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా వ్యవహరించారు.